ఆటో డ్రైవర్లకు దక్కని భరోసా

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10వేల సహాయం
- ఇస్తామని హామీ ఇచ్చి మాటతప్పిన కూటమి ప్రభుత్వం



పులివెందుల ఆటో స్టాండులో ఉన్న ఆటోలు

పులివెందుల రూరల్ : ఎన్నికల ముందు ఒక మాట, తర్వాత మరోమాట చెప్పడం కూటమి ప్రభుత్వానికి అలవాటయ్యింది. అధికారం రాకముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్ని వర్గాల వారికి ఇష్టం వచ్చిన విధంగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను మరిచారు. ప్రజలను ప్రతిసారి మోసం చేయడంలో చంద్రబాబుకు దీటు ఎవరూ లేరు. 2014లో 600కుపైగా హామీలు ఇచ్చి మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. 2024లో కూడా అదే రీతిలో హామీలు ఇచ్చి తనదైన శైలిలో ప్రజలకు ఎగనామం పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారం లేకుంటే సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు ఏటా రూ.15వేల ఆర్థిక సాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 9 నెలలు పూర్తవుతున్నా ఒక హామీని కూడా అమలు చేయలేకపోతున్నారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం పథకానికి రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో ఆటో డ్రైవర్లు కూటమి ప్రభుత్వం మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మాట తప్పని నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2019 ఎన్నికల ముందు ప్రతిపక్షనేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆటో డ్రైవర్లు కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. తాము అధికారంలోకి వస్తే సొంతంగా ఆటో నడుపుకునే వారికి, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు ఇస్తామని ఆయన మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ సీపీ పభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు ప్రతి ఏడాది అర్హులైన వారందరికీ డబ్బులు వారికి ఖాతాలో జమ చేయడం జరిగింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.40వేలు అందింది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేల చొప్పున నాలుగేళ్లపాటు నాకు 40,000 రూపాయలు నా అకౌంటులో జమ అయ్యింది. కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది రూ.10వేలు ఆర్థిక సాయం అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక రూపాయి కూడా ఆటో డ్రైవర్లకు సాయం అందించలేదు.

– నాగమణిరెడ్డి, ఆటో డ్రైవర్, పులివెందుల

కూటమి ప్రభుత్వం డ్రైవర్లను మోసం చేస్తోంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు ఇచ్చి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా సంక్షేమ బోర్డు ఏర్పాటు లేదు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేల చొప్పున చెప్పిన తేదీకి ఇచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను పట్టించుకోవడంలేదు.

– మహేశ్వర, ఆటో డ్రైవర్, పులివెందుల

పారిశుద్ధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలి



వేపరాల గ్రామంలో ఇంటి కొలతలను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

మైలవరం : మండలంలోని గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అయా గ్రామాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మీ తెలిపారు. మంగళవారం మండలంలోని వేపరాల గ్రామంలో ఇంటింటికి వెళ్లి తడి పొడి వ్యర్థాలనే వేరు వేరుగా పారిశుద్ధ్య కార్మికులు తమ ఇండ్ల వద్దకు వచ్చినప్పుడు వారికి అందజేయాలని ఆమె తెలిపారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వర్మి కంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయించి వాచిన డబ్బును గ్రామ పాచాయతీ అవసరాలకు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో వంద శాతం ఇంటి పన్ను, కొళాయి పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం వేపరాల గ్రామంలో ఇంటి కొలతలను, పంచాతీ రికార్డులను ఆమె తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రామచంద్రారెడ్డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పెద్దచెప్పలిలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న కెజియా

కమలాపురం : ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్‌డీ కెజియా తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దచెప్పలిలో ప్రజలకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ప్రోగ్రాంపై ఇంటింటికి వెళ్లి శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే ప్రజలందరూ తమ ఇళ్లలోని చెత్తను పంచాయతీ సిబ్బందికి తడి పొడి చెత్తను వేరు వేరుగా అందించాలన్నారు. ఇప్పటికే పంచాయతీ సిబ్బంది మీకు రెండు రంగుల డస్ట్‌బిన్‌లు అందించారని ఆమె గుర్తు చేశారు. ఆ డస్ట్ బిన్‌లలో మీ ఇంటి వద్దకు వచ్చిన హరిత రాయబారులకు అందించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. ఎవరి ఇంటి పరిసరాలు వారు శుభ్రం చేసుకుంటే గ్రామం అంతా పరిశుభ్రంగా ఉంటుందన్నారు. గ్రామంలో 3 వేలకు పైగా జనాభా ఉన్నారని, ప్రతి ఒక్కరూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పెంచలయ్య, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి



నల్లచెరువుపల్లె ఆర్‌ఎస్‌కేలో ఇ పంట నమోదు వివరాలు ప్రదర్శిస్తున్న ఏడీ

వేముల : రబీలో రైతులు సాగు చేసిన పంటలకు ఇ పంట నమోదు రైతు జాబితాను మంగళవారం ప్రదర్శించారు. మండలంలోని నల్లచెరువుపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో రబీ సీజన్‌కు సంబంధించి ఇ పంట నమోదు ప్రక్రియను ఏఓ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఏడీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతు జాబితా వివరాలను ఆర్‌ఎస్‌కేలో ప్రదర్శించామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల్లో తెలయజేయాలన్నారు. ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో 3,778 మంది రైతులు 11,555 ఎకరాలలో పంట నమోదు చేసుకున్నారన్నారు. పంట నమోదు చేసుకున్న 3778 మంది రైతులకు గాను 3685 మంది రైతులు ఇకేవైసీ చేయించుకున్నారన్నారు. పంట నమోదుతో పాటు ఇకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జి సుదర్శన్ రైతులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి



ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కొండాపురం : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాయంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మావతికి సీపీఐ నాయకులు వినతిపత్రం అనంతరం మాట్లాడారు. గండికోట జలాశయంలో సర్వం కోల్పోయి ఉపాధి లేక అవస్థలు పడుతున్న నిర్వాసితులకు ప్రతి పేదవారికి రెండు ఎకరాలు భూమి ఇవ్వాలన్నారు. పేదలకు ఇంటి స్థలం విషయంపై క్యాబినేట్‌లో ఆమోదం తెలిపిన రెవెన్యూ అధికారులకు స్థలాలు మంజూరు చేయమని ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైనలో ఓపేన్ కాలేదని ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, పి.వెంకటరమణ, సుదర్శన్‌రెడ్డి, సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

కమలాపురం : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ఆవిర్భవించి 13 ఏళ్లు పూర్తి అయి 14వ ఏట అడుగిడుతున్న తరుణంలో బుధవారం ఉదయం పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కడప నగరంలో ఉదయం 10 గంటలకు జరిగే యువత పోరు కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలి

పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలోని గ్రామాలలో నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎక్సైజ్‌శాఖ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాటుసారాపై ప్రజల్లో అవగాహన కలిగించే విధంగా ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. పులివెందుల నగరి గుట్ట, లింగాల మండలంలోని అంబకపల్లె, వేంపల్లె మండలంలోని రామిరెడ్డిపల్లె, చక్రాయపేట మండలంలోని సుగాలితాండా, కుప్పం తాండాలలో నవోదయం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నాటు సారాయి తయారు చేసిన, విక్రయాలు జరిపిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. 8 ఎళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తామన్నారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన



చిన్నచెప్పలి ఆర్‌ఎస్‌కేలో ఇ-క్రాప్ నమోదు జాబితాను ప్రదర్శిస్తున్న ఏవో సరస్వతి

కమలాపురం : మండలంలోని అన్ని ఆర్‌ఎస్‌కేలలో పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శనకు ఉంచామని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం చిన్నచెప్పలిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట సాగు చేసి ఇ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాల జాబితాలను అన్ని ఆర్‌ఎస్‌కేలలో ప్రదర్శనకు ఉంచామన్నారు. ఈనెల 18వ తేదీ వరకు జాబితా ప్రదర్శన ఉంటుందని, అందులో ఎలాంటి లోపాలు ఉన్నా 18 తర్వాత ఫిర్యాదు చేయాలని ఆమె రైతులకు సూచించారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు ప్రత్యేక విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ పంట రుణాలు, వ్యవసాయ పరికరాలు, ఇన్సూరెన్స్ వంటి పథకాలు అమలు కావాలంటే తప్పని సరిగా ఈ విశిష్ట సంఖ్య అవసరం అన్నారు. అలాగే పంట దిగుబడులు విక్రయించుకోవాలనుకునే రైతులు ముందుగా సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మినుము క్వింటా ధర రూ.7400 గా నిర్ణయించిందని, శనగ రూ.5650, కందులు రూ.7550 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని ఆమె వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి

జమ్మలమడుగు రూరల్ : ఆత్మహత్య చేసుకున్న దుగ్గనపల్లి రైతు చిపాటి మోషే కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారాన్ని దాల్మియా యాజమాన్యం ఇవ్వాలని సీపీఐ ఏరియా కార్యదర్శులు మూలే వెంకట సుబ్బారెడ్డి, ప్రసాదులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామాలోని రైతాంగం పరిశ్రమ నుంచి వెలువడే దుమ్ము, ధూళి పంట పోలాల్లో పండి నష్టం జరుగుతుందన్నారు. దీంతో రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

పేదల స్థలాల కబ్జాపై వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కొత్తపల్లె గ్రామస్తులు

పులివెందుల రూరల్ : మండలంలోని కొత్తపల్లె సర్వే నెంబర్ 114లో 2011 సంవత్సరంలో రెవెన్యూ అధికారులు 53 ప్లాట్లు వేసి అర్హులైన వారికి పట్టాలు ఇచ్చారన్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరు ఇల్లు నిర్మించుకోలేదు. కొంత మంది బేష్మట్టాలు నిర్మించుకున్నారు. గతంలో రోడ్డు సౌకర్యం లేక పోవడం వల్ల ఇల్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. మార్చి 10వ తేదీ బోనం గంగాధర్ అనేవ్యక్తి కొత్తపల్లె గ్రామంలో బేష్మట్టాలు నిర్మించిన వాటిని జేసీబీతో ధ్వంసం చేశాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలు ఇచ్చిన పట్టా స్థలాలను కూడా దార్జాగా కబ్జా చేస్తున్నారని వాపోతున్నారు. పులివెందులకు చెందిన గంగాధర్ నేను విలేకరిని నాకు భూమికి సంబంధించి పట్టా ఉందన్నారు. గతంలో బేష్మట్టం వేసుకునేందుకు ఖర్చు అయిందన్నారు. మంగళవారం కొత్తపల్లె గ్రామానికి చెందిన సర్పంచు ప్రసాదు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ నజీర్‌హమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు.

నూనె గింజల పంటలతో అధిక ఆదాయం

కడప అగ్రికల్చర్: నూనె గింజల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప మండల పరిధిలోని నానపల్లెలో జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా రైతులకు నూనె గింజల సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా నూనె గింజల పంటలను సాగు చేసుకుంటే అధిక ఆదాయం పొందవచ్చన్నారు.

తెల్లదోమను నివారించాలి



నువ్వుల పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : వేసవిలో సాగు చేసిన నువ్వుల పంటకు తెల్లదోమ ఆశించిందని, ఈ తెల్లదోమను నివారించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో వేసవిలో సాగు చేసిన నువ్వుల పంటను ఆయన పరిశీలించారు. ఈ పంటకు తెల్లదోమ ఆశించిందని రైతులకు సూచించారు. అలాగే వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వలన రసం పీల్చే పురుగుల ఉధృతి కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. రసం పీల్చే పురుగుల నివారణ కూడా కచ్చితంగా చేపట్టాలన్నారు. పంటలో తెల్లదోమను నివారించడానికి ఎకరాకు 15-20 వరకు పసుపు రంగు జిగురు అట్టలను అమర్చాలన్నారు. అలాగే రసం పీల్చే పురుగు నివారణకు డయాఫెన్తురియన్ 1.25 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. లేని పక్షంలో స్పైరోమెసిఫెన్ (ఒబెరాన్) 1 మి.లీ. నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏ బాబు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను మోసగించిన కూటమి ప్రభుత్వం



పులివెందులలో యువత పోరు పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు



సింహాద్రిపురంలో యువత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



లింగాలలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వేములలో పోస్టర్లను విడుదల చేస్తున్న నాగేళ్ల సాంబశివారెడ్డి, తదితరులు



వేంపల్లెలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : రాష్ట్రంలోని యువత, విద్యార్థులను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై పోరుబాటకు యువత, విద్యార్థులు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ కన్వీనర్ రామ్ లక్ష్మణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్ రాజారెడ్డి భవన్ (పాత ఎమ్మెల్యే ఆఫీసు)లో మంగళవారం యువ నాయకులతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 12వ తేదీన కడప నగరంలో జరిగే యువతపోరులో ప్రభుత్వాన్ని ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశాలపై ప్రశ్నిస్తూ జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు, యువతను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ యువత పోరు కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. అనంతరం పోస్టర్లను ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు రాజేష్, నంద, మిత్ర ఆనంద్, వికలాంగుల అధ్యక్షుడు భాస్కర్, పాపన్న రాయల్, తొండూరు మండల యూత్ నాయకులు అదికేశవరెడ్డి పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో యువత పోరు ర్యాలీకి పిలుపు నిచ్చారు. వాటికి సంబంధించి మంగళవారం బస్టాండ్ సర్కిల్‌లోని వైఎస్ విగ్రహం వద్ద యువత పోస్టర్లను ఆవిష్కరించి నేడు కడపలో జరిగే పోరు ర్యాలీకి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ యువతకు, నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి, మాజీ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి, నీలవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు జాఫర్, మనోహరరెడ్డి, వైఎస్సాఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : యువత పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ రమాదేవి, మండల కన్వీనర్ బాబురెడ్డిలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ మంగళవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో వైఎస్సాఆర్ సీపీ నాయకులు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. యువత పోరుబాట కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ రైతు కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, యువత కన్వీనర్ మనోహర్‌రెడ్డి, కడప పార్లమెంటరీ కన్వీనర్ జగన్‌మోహన్ రెడ్డి, మండలంలోని వైఎస్సాఆర్ సీపీ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు,

వేములలో..

వేముల : వైఎస్సార్ సీపీ ఆదేశాల మెరుకు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పార్టీ నాయకులతో కలసి ఆయన యువత పోరు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి సర్కార్ విఫలం అయిందన్నారు. యువత పోరుకు ప్రతి ఒక్కరు అండగా నిలిచి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, వెంకటనారాయణ, రాఘవరెడ్డి, అంజనేయులు, చలపతి, వెంకటశివారెడ్డి, మాపీరా, గంగిరెడ్డి, సుబ్బారెడ్డి, జర్మియా పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మునీర్‌బాషా, రవిశంకర్‌గౌడ్‌లు పిలుపు నిచ్చారు. మంగళవారం ఉదయం గండి రోడ్డులో ఉన్న స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు పార్టీ నాయకులతో కలిసి యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని, రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కావున యువత పోరులో విద్యార్థులు నిరుద్యోగులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కటిక చంద్రశేఖర్, కార్మిక విభాగం అధ్యక్షులు బాలాజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు బుధవారం కడప పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు చేపట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయలాని మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని మండల కన్వీనర్లు ధన్నవాడ మహేశ్వరరెడ్డి, ఎం. విష్ణువర్ధన్‌రెడ్డిలు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి పిలుపుమేరకు కడపలో జరిగే యువత పోరు కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

బాల త్రిపురసుందరి దేవికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ బాలత్రిపురసుందరి దేవి అమ్మవారు

జమ్మలమడుగు రూరల్ : మండలంలోనికన్యతీర్థంలో మంగళారం అలయ వార్షికోత్సవం సందర్బంగా శ్రీ బాలత్రిపుర సుందరి దేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు హరిహరనాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం శ్రీ చక్ర పూజ, అభిషేకాలు, సహస్ర నామార్చనలు, కుంకుమార్చన, కలశస్థాపన, గణపతి పూజ, చండీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ వెంకట రామిరెడ్డి

చింతకొమ్మదిన్నె : పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించి జీవితంలో స్థిరపడటానికి మార్గం ఏర్పాటు చేసుకోవాలని ఎంఈఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం మండలంలోని మూలవంక జిల్లా పరిషత్ ఉర్దు ఉన్నత పాఠశాలలో గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి ఎంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలను ఇప్పటి వరకు కల్పించలేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఈనెల 14వ తేదీన యూటీఎఫ్ భవనంలో జరిగే నిరుద్యోగ సదస్సును విజయవంతం చేయాలని వారు కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మొదటి సంతకం ఉపాధ్యాయుల పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా ఇంత వరకు డీఎస్సీపై ప్రకటనలేదన్నారు. నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేయడం కోసం ఈనెల కడపలోని యూటీఎఫ్ భవన్‌లో నిరుద్యోగ సదస్సును ఏర్పాటు చేశామని యువత హాజరై విజయవంతం చేయాలన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని ఆసనం దగ్గర లక్ష్మీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిద్దయ్య(60) మృతి చెందారని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి వారి స్వగృహానికి చేరుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్ యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గణేష్‌రెడ్డి ఉప్పరపల్లి ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇ పంట నమోదు జాబితా తనఖీ

లింగాల : మండలంలోని మురారీ చింతల రైతు సేవాకేంద్రంలో మంగళవారం జరుగుతున్న ఇ పంట నమోదు జాబితాను వ్యవసాయ అధికారి రమేష్‌తో కలసి ఏడీఏ ప్రభాకరరెడ్డి తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో ఇ పంట నమోదు రబీ 2024-25కి సంబంధించి జాబితా పూర్తి అయిందన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాలలో జాబితాను ప్రదర్శిస్తున్నామన్నారు. జాబితాపై రైతుల అభ్యంతరాలు స్వీకరణ కోసం రైతు సేవా కేంద్రలలో రైతు గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 18 తేదీలోపు తెలియజేయాలన్నారు.

రక్తదాన శిబిరం

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. యోగివేమన విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవంలో భాగంగా మంగళవారం జాతీయ సేవా పథకం-9, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్-కడప) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం వైవీయూ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రధాన ఆచార్యులు ఎస్. రఘునాథ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు.